ప్రజాశక్తి

శనివారం 25 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి



ఉక్కు కార్మికులపై..
విద్యుత్ ఛార్జీల పిడుగు !

- కేంద్రం, యాజమాన్యం ఒక్కటై కుట్రలు
- యూనిట్ 50 పైసలు నుంచి ఒకేసారి రూ.8కి పెంపు
- భగ్గుమంటున్న స్టీల్‌ప్లాంట్ కార్మిక కుటుంబాలు

విద్యుత్ ఛార్జీల పెంపుపై ధర్నా చేస్తున్న ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కార్మికులపై కేంద్రం, ప్లాంట్ యాజమాన్యం కుట్రలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఉక్కు నగరం (స్టీల్ టౌన్‌షిప్)లో నివాసముంటున్న మూడు వేల మంది కార్మికులపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉక్కు యాజమాన్యం విద్యుత్ ఛార్జీల పిడుగు పడేసింది. ఒకేసారి రూ.8 యూనిట్‌పై కట్టాలంటూ జారీచేసిన సర్క్యులర్‌ను చూస్తే టౌన్‌షిప్ నుంచి కార్మిక కుటుంబాలను తరిమేసే యత్నాలకు యాజమాన్యం దిగిందనేది స్పష్టమవుతోంది. 1984 నుంచి స్టీల్‌ప్లాంట్‌లో పవర్ ప్లాంట్ చేస్తున్న ఉత్పత్తితో యూనిట్ ఛార్జీ కింద కేవలం 50 పైసలే కార్మికుల నుంచి వసూలు చేస్తూ రాగా రెండు రోజుల క్రితం యాజమాన్యం జారీచేసిన సర్క్యులర్ నెం.24/టిఎ/ఎల్అండ్ఇ/62లో మిగతా 2లో..

వేట నిషేధ భృతి వెంటనే ఇవ్వాలి

సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇవ్వాల్సిన భృతిని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 14 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లోకి వచ్చినప్పటికీ ఇంత వరకూ వేటలేని మత్స్యకారులకు పరిహారం చెల్లించకపోవవడం అన్యాయమని పేర్కొన్నారు. అటు వేటలేక, ఇటు జీవనోపాధి లేక రోజువారీ అవసరాలు తీర్చుకొనే ఆదాయం రాక మత్స్యకారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. గతేడాది రూ.10 వేలు భృతి ఇచ్చారని, ఆ మొత్తం ఎటూ సరిపోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. వేట నిషేధం విధించి నెల గడిచినప్పటికీ భృతి ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. కుటుంబ పోషణ కోసం ఇంట్లో వున్న బంగారు వస్తువులను తాకట్టు పెట్టి కుటుంబ అవసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితి మత్స్యకారులకు నెలకొందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సాంకేతిక అంశాలను పక్కన పెట్టి వేటపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకార కుటుంబాలన్నింటికీ పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు సంబల్‌పూర్ - ఎస్ఎంవి బెంగళూరు - సంబల్‌పూర్, ఎస్ఎంవిటి బెంగళూరు - భువనేశ్వర్ - ఎస్ఎంవి బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు 06279 ఎస్ఎంవి బెంగళూరు - సంబల్‌పూర్ ప్రత్యేక రైలు జూన్ 7 అర్ధరాత్రి 00.10 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుంచి బయలుదేరి అదేరోజు రాత్రి 20.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 20.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 05.00 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. 06280 సంబల్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు ప్రత్యేక రైలు జూన్ 8 ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్ నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 21.18 గంటలకు దువ్వాడకు చేరుకుని మరల 21.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 19.30 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు మిగతా 2లో..

సుందరరావుపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి
▶ వార్త 2లో..

14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డిఇఒ పరీక్ష
▶ వార్త 7లో..

ఎత్నిక్ సంప్రదాయ ప్రింట్ ఎక్స్‌పో ప్రారంభం
▶ వార్త 2లో..

కౌంటింగ్ సిబ్బందికి తొలి విడత ర్యాండమైజేషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయిన నేపథ్యంలో జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ విసి హాలులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విఎంఆర్‌డిఎ జెసి, ఎన్ఐసి అధికారులతో కలిసి శుక్రవారం తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. విశాఖ పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఇవిఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు, పర్యవేక్షించేందుకుగాను కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్ వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు కలిపి 997 మంది అవసరంకాగా రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయిస్తూ మొత్తం 1,022 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారిలో కౌంటింగ్ సూపర్ వైజర్లు 312 మంది ఉండగా, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్ వైజర్లు 357 మంది, మైక్రో అబ్జర్వర్లు 328 మంది ఉన్నారు. మల్లికార్జున వారందరికీ దిశా నిర్దేశం చేశారు.

నేడు తులసి సంస్మరణ సభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షురాలు వై.తులసి సంస్మరణ సభ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఈ మేరకు సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.మణి, ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 21న అర్ధరాత్రి సమయంలో గుండెపోటుతో ఆకస్మికంగా తులసి మరణించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల సభ్యులు, అంగన్వాడీ యూనియన్ సభ్యులు సభకు హాజరు కావాలని కోరారు.

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో వృద్ధి

- చివరి త్రైమాసికంలో గతేడాది కంటే పెరుగుదల
- ప్రధాన ప్రాంతాల్లో పెరిగిన స్థిరాస్తి వ్యాపారం
- ఎన్నికల ముందు కదలిక

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు తగ్గినా, స్థిరాస్తి వ్యాపారంలో వృద్ధి కనబడుతోంది. 2022-23 ఆఖరి త్రైమాసికం కంటే రిజిస్ట్రేషన్లు 2023-24 చివరి త్రైమాసికంలో 1558 తగ్గాయి. అయితే స్థిరాస్తి విలువ పెరగడంతో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు తగ్గినా, ఆదాయంలో పురోగతి కన్పించింది. ఈ ఏడాది ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని స్థిరాస్తి వ్యాపారులు ధరలు పెరిగిన ప్రాంతాల్లో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తిచూపారు. జిల్లాలోని పది సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో 2023 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల నిర్దేశిత లక్ష్యంలో 57.17 శాతానికి ఆదాయం చేరుకుంటే, 2024 జనవరి నుంచి మార్చి వరకు ఆ వృద్ధి 69.92 వరకు పెరిగింది. ప్రధానంగా జిల్లా కేంద్రం అనకాపల్లి, కోటవురట్ల, లంకెలపాలెం, మాడుగుల, యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగింది. జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, కె.కోటపాడు, కోటవురట్ల, లంకెలపాలెం, మాడుగుల, నక్కపల్లి, నర్సీపట్నం, సబ్బవరం, యలమంచిలిల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. 2023 జనవరి నుంచి మార్చి వరకు మిగతా 2లో..

అనకాపల్లిలోని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మొదటి పేజీ తరువాయి..

ఉక్కు కార్మికులపై విద్యుత్ ఛార్జీల పిడుగు !

ఏకంగా రూ.8ని యూనిట్‌కు వసూలు చేస్తామంటూ పేర్కొనడం కార్మికులు, వారి కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేస్తోంది. స్టీల్ యాజమాన్యం ఇప్పటికే కార్మికులు, ఉద్యోగులకు ఏప్రిల్ నెల జీతాలే పూర్తిగా ఇవ్వలేదు. గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా విద్యుత్ ఛార్జీల భారాలను ఇప్పుడు తాజాగా మోపింది. ఈ భారాలను తప్పించుకుందామని బయటకెళ్లిపోతే కార్మికులకు హెచ్‌ఆర్‌ఎ ఉండదు. దీంతో కార్మికులు అడకత్తెరలో పోక చెక్కమాదిరిగా ఇరుక్కుపోయారు.

ఈ సర్క్యులర్ వెనుక దాగి వున్న కుట్ర కోణం ఏమిటి ?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలకు బలికాకుండా సమైక్యంగా స్టీల్ కార్మికులు పోరాడుతున్న నేపథ్యంలో అన్ని వైపుల నుంచీ కార్మికుల పోరాట శక్తిని బలహీనపరిచే కుట్రలకు కేంద్రం దిగుతోంది. ఏడాది కాలంగా ఈ చర్యలను మరింత ఉధృతం చేస్తోంది. వేతనాలివ్వకుండా చోద్యం చూస్తోంది. ఈ ఏడాది మార్చి వరకూ రూ.2 వేల కోట్లు మార్కెట్‌లో స్టీల్ సేల్ ద్వారా టర్నోవర్ వచ్చినా రూ.85 కోట్లు మేర ఇవ్వాల్సిన ఏప్రిల్ జీతాలను పూర్తిగా ఇవ్వలేదు. మరోవైపు గంగవరం పోర్టు నుంచి రావాల్సిన వేల టన్నుల కొకింగ్ కోల్‌ను నెల రోజులపాటు ఇటీవల కేంద్రం ఆదానీ ద్వారా నిలిపివేయించింది. స్టీల్‌ప్లాంట్‌కు సొంత పవర్ ప్లాంట్ ఉన్నా దాన్ని పనిచెయ్యనివ్వలేదు. గెట్స్, వేస్ట్ ఎనర్జీ, నూడో, సోలార్ గ్యాస్ వంటి వాటితో చౌకగా విద్యుత్ ప్లాంట్‌లో గతంలో తయారయ్యేది. వీటన్నిటినీ స్టీల్ యాజమాన్యం కేంద్రం ఆదేశాలతో మూలకు చేర్చేసింది. బ్లాస్ట్ ఫర్నేస్‌లు రెండింటిని మూసివేసింది. ఇకపోతే గనులు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలువరించి ఉత్పత్తిని దెబ్బతీశాయి. తాజాగా ఎపిఇపిడిసిఎల్ నుంచి విద్యుత్‌ను ప్లాంట్ కొనుగోలు చేస్తోంది. రాష్ట్ర విద్యుత్ సంస్థ ఎంతైతే స్టీల్‌ప్లాంట్ నుంచి వసూలు చేస్తుందో యూనిట్‌కు ఆ మొత్తం ధరను కార్మికుల నుంచి రాబట్టేందుకు కేంద్రం ఇక్కడి యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతో తాజాగా సర్క్యులర్ ఇచ్చింది. దీంతో యూనిట్ 50 పైసలుగా ఉన్న దాన్ని ఏకంగా రూ.8 చేసేసింది. ఇదే కొనసాగితే తాము జీవించడం కష్టమని కార్మికులు లబోదిబోమంటున్నారు. స్టీల్ టౌన్‌షిప్‌లో 6 వేల క్వార్టర్స్ ఉండగా 3 వేల మంది కార్మికులు నివసిస్తున్నారు. వీరంతా ఈ ఛార్జీలు ఏప్రిల్ 1 నుంచే చెల్లించాల్సి ఉంది. నెలకు రూ.వేలకు వేలు విద్యుత్‌కే ఖర్చవుతుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

2017 నుంచి వేతన ఒప్పందానికి ఎగనామం

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులపై ఏదో ఒక ఆర్థిక భారాన్ని మోపేందుకు స్టీల్ యాజమాన్యం, కేంద్రంలోని మోడీ సర్కారు పలు విధానాలను తీసుకుంటూ ఉన్నాయి. 2012 సంవత్సరపు జీతాలతోనే కార్మికులు బతుకులీడుస్తున్నారు. 2017లో నూతన వేతన ఒప్పందం అమలు కావాల్సి ఉంది. ఈ మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్స్‌లోనూ వేతన ఒప్పందం అమలు చేసినా వైజాగ్‌స్టీల్‌లో కావాలనే కేంద్రం ఎగనామం పెట్టేసింది. దీంతో రూ.వేలకు వేలు కార్మికులు నష్టపోతూ వస్తున్నారు. తాజాగా టౌన్‌షిప్‌లో విద్యుత్ ఛార్జీల భారం మోపడంపై సర్వత్రా ఆగ్రహాలు వ్యక్తమవుతున్నాయి. టౌన్‌షిప్ నుంచి బయటకు వెళ్లి వేరే ఇళ్లల్లో ఉండాలన్నా వీలుకాని నిబంధనలను స్టీల్ యాజమాన్యం విధించింది. 2016 నుంచి ప్లాంట్‌లో చేరిన కార్మికులంతా విధిగా టౌన్‌షిప్‌లో ఉండాలని, లేదంటే హెచ్‌ఆర్‌ఎ వర్తించదన్న షరతును యాజమాన్యం విధించడంతో కార్మికులు ఈ సర్క్యులర్‌పై భగ్గుమంటున్నారు.

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగూడ, కేసింగ, టిట్లాగర్, బలంగీర్ బర్గర్ రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

06271 ఎస్ఎంవిటి బెంగళూరు - భువనేశ్వర్ ప్రత్యేక రైలు మే 31 అర్ధరాత్రి 00.10 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరు నుండి బయలుదేరి అదేరోజు రాత్రి 20.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 20.07 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 04.00 ట్రిప్పుకు భువనేశ్వర్ చేరుకుంటుంది. 06272 భువనేశ్వర్ - ఎస్ఎంవిటి బెంగళూరు ప్రత్యేక రైలు జూన్ 02 ఉదయం 06.30 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 14.08 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 14.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.00 గంటలకు ఎస్ఎంవిటి బెంగళూరుకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్ మీదుగా ప్రయాణిస్తాయి.

మూర్తి యాదవ్‌కు కొమ్ముకాస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేస్తున్న పలు అక్రమాల గురించి ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో తాను ఒక పోస్ట్ పెట్టినందుకుగాను తనపై మూర్తి అనుచరులు దాడికి పాల్పడ్డారని, కత్తితో తనను హత్య చేయాలని ప్రయత్నించారని విశాఖపట్నం పార్లమెంటు స్వతంత్ర అభ్యర్థి దేవర శంకర్ ఆరోపించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడి సంఘటన వీడియోలో చిత్రీకరణ జరిగిందని తెలిపారు. వీడియోతో సహా పలు ఆధారాలను వివరిస్తూ ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో తాను లిఖితపూర్వకంగా సంఘటన జరిగిన ఈ నెల 22న ఫిర్యాదు చేశానని తెలిపారు. పోలీసులు మాత్రం మూర్తియాదవ్‌కు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఆయన్ని ఇంతవరకూ అరెస్టు చేయలేదన్నారు. మూర్తి యాదవ్ వల్ల తనకు ప్రాణ హాని ఉందన్నారు. సమావేశంలో ఎంపీ స్వతంత్ర అభ్యర్థి వాసుపల్లి సురేష్, బిఎస్‌పి ఎంపీ అభ్యర్థి పెదపెంకి శివప్రసాదరావు, బాధితుని తల్లి దేవర బంగారమ్మ పాల్గొన్నారు.

సుందరరావుపై అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (ఎపిఎస్ ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరరావుపై అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సుందరరావుపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగదాంబ దరి ఎన్‌పిఆర్ భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎపిపిటిడి ఎస్‌డబ్ల్యుఎఫ్ సీనియర్ నాయకులు వి.తులసీరాం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు (ఎపిఎస్ ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరరావు ఏలూరులో ఇటీవల జరిగిన ఒక సమావేశంలో పాల్గొన్నారనే కారణంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనగా పేర్కొంటూ న్యాయవిరుద్ధంగా ఎపిపిటిడి యాజమాన్యం ఛార్జిషీట్ ఇచ్చి, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా సస్పెన్షన్ విధించిందని తెలిపారు. ఎపిపిటిడికి సంబంధం లేని ఒక పత్రికలో వచ్చిన చిన్న వార్తను సాకుగా చూపి ఈ చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ఇది కక్ష సాధింపుతో తీసుకున్న చర్యని అన్నారు. సుందరరావు మాట్లాడిన అంశం కూడా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పరిధిలోనిది కాదన్నారు. యూనియన్లను నోరు ఎత్త నివ్వకుండా ఆర్‌టిసి యాజ మాన్యం ఇటువంటి దాడులు చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి. కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, సిఎఫ్‌టియుఐ ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షులు పి.భానుమూర్తి, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో-కన్వీనర్ కె.కుమార్ మంగళం, శ్రామిక మహిళ గౌరవ అధ్యక్షులు పి.మణి, మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షులు కెఎజె.రావు, ఆశా వర్కర్స్ యూనియన్ కోశాధికారి సీతారత్నం, ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, హాస్పిటల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసీరాం

తీర్మానం

ఎపిపిటిడి ఎండి తక్షణమే జోక్యం చేసుకొని సుందరరావుపై సస్పెన్షన్‌ను రద్దుచేసి విధుల్లోకి తీసుకొనే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

అన్ని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిహెచ్.సుందరరావుపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ ఎపిపిటిడి కమిషనర్‌కి మెయిల్స్ ద్వారా లేఖలు పంపాలని నిర్ణయించారు.

ఎత్నిక్ సంప్రదాయ ప్రింట్ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పో ఆధ్వర్యంలో విశాఖ నగరంలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో ఐదు రోజులపాటు నిర్వహించే ఎత్నిక్ సంప్రదాయ ప్రింట్ ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. పలు రంగుల, డిజైన్స్ వస్త్రాలు, ఉపకరణాల అమ్మకాలు ఎక్స్‌పోలో చేపట్టనున్నట్టు నిర్వాహకులు మీడియాకు తెలిపారు. ఈ ఎక్స్‌పో నందు షాపర్స్ తమకు కావలసిన వివిధ రకాల చీరలు, సల్వార్లు, టాప్స్, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాలను కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. ఎక్స్‌పోలోని విభిన్న స్టాల్స్‌వద్ద విస్తృతమైన అద్దకం, ప్రింటెడ్, ఎంబ్రాయిడరీ, పోచంపల్లి కలంకారీ చీరలు నుంచి సంప్రదాయ కొల్‌కతా, భాగల్పురి ప్రింట్లు, లక్నో చికాన్ వర్క్, బనారస్ పట్టు చీరలు వగైరా లభిస్తాయన్నారు. రేషం పల్లూతో నేసిన మట్కా సిల్క్ బైలూమ్ చీరలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయన్నారు. పశ్చిమ బెంగాల్ కళాత్మకతను ప్రదర్శిస్తాయన్నారు. అలాగే విభిన్నమైన స్టయిల్స్‌కు ప్రాధాన్యతనిచ్చే వారి కోసం మల్బరీ సిల్క్, చందేరి చీరలు, పాట్లీ పల్లూ, కలంకారీ ప్రింట్స్‌లో మధ్యప్రదేశ్ వారి స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. సాంప్రదాయతను ఇష్టపడే వారి కోసం పోచంపల్లి కాటన్, ఉప్పాడ, వెంకటగిరి పట్టుచీరలు, అలాగే కాంచీపురం నుండి వచ్చిన బంగారు, వెండిజరీ చీరలు ఈ ఎక్స్‌పోలో అందుబాటులో ఉన్నాయన్నారు. జైపూర్ దుపట్టాలు, సల్వార్ మెటీరియల్, కుర్తీలు, రాజస్థాన్ కోటా డోరియా, ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన బనారస్ జమదాని, జమావార్, చికాన్ రకాలు ప్రదర్శనలో ఉన్నాయన్నారు. కాశ్మీర్ షాల్స్, స్టోల్స్, బంధేజ్, బంధాని వస్త్రాలు కూడా లభిస్తాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 28వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని, చెల్లింపులు కోసం అన్ని రకాల యుపిఎ, డెబిట్, క్రెడిట్ కార్డులు స్వీకరిస్తామని చెప్పారు.

ఎక్స్‌పోలో చీరను ప్రదర్శిస్తున్న మహిళ

రిజిస్ట్రేషన్ల ఆదాయంలో వృద్ధి

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రూ.101.22 కోట్ల రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీంట్లో 20,153 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.57.87 కోట్లు (57.17 శాతం) ఆదాయం వచ్చింది. 2024 జనవరి నుంచి మార్చి వరకు రూ.118.21 కోట్ల లక్ష్యంలో 18,595 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.82.65 కోట్లు (69.92 శాతం) ఆదాయం చేకూరింది. ఆదాయం వచ్చిన వాటిలో అనకాపల్లి, కోటవురట్ల, లంకెలపాలెం, మాడుగుల, యలమంచిలి వాటా ఎక్కువగా వుంది.

ప్రభుత్వం మారితే స్థిరాస్తుల ధరల్లో మార్పులుంటాయని గుర్తించిన వ్యాపారులు భూముల కొనుగోలు, అమ్మకాలకు అవకాశమున్న ప్రాంతాల్లో క్రయవిక్రయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అందుకని అంతటా ఆదాయాల్లో సమతుల్యత లోపించింది. లంకెలపాలెంలో 106.12 శాతం రిజిస్ట్రేషన్లలో పురోగతి వుంది.

2024, 2023లలో జనవరి నుంచి మార్చి వరకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల లక్ష్యం, ఆదాయ వివరాలు

	2024		2023	
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	చివరి త్రైమాసిక లక్ష్యం	ఆదాయం (కోట్లలో)	చివరి త్రైమాసిక లక్ష్యం	ఆదాయం (కోట్లలో)
అనకాపల్లి	28.25	19.65	21.22	13.20
చోడవరం	6.75	3.33	6.22	3.16
కోటపాడు	2.49	1.27	1.99	1.13
కోటవురట్ల	4.23	3.06	3.59	2.02
లంకెలపాలెం	21.07	22.37	18.63	10.89
మాడుగుల	2.55	1.50	2.33	97.25 లక్షలు
నక్కపల్లి	12.75	9.10	9.07	7.17
నర్సీపట్నం	8.47	5.80	6.84	4.96
సబ్బవరం	11.98	5.23	9.91	5.82
యలమంచిలి	19.63	11.30	21.37	8.51
మొత్తం	**118.21**	**82.65**	**101.22**	**57.87**

మురుగు కాలువపై ఇంటి నిర్మాణం

- కబ్జాతో కుచించుకుపోయిన డ్రైనేజీ, రోడ్డు
- అవస్థలు పడుతున్న ప్రజలు..పట్టని అధికారులు
- నెల్లిముక్కు నిర్వాసిత కాలనీలో పరిస్థితి..

ప్రజాశక్తి -గాజువాక : నిర్వాసిత కాలనీల్లో ఖాళీ భూములు కబ్జా, అన్యాక్రాంతమౌతున్నాయని ఇన్నాళ్లు ఆరోపణలు వినిపిస్తుండగా, ఇపుడు ఏకంగా మురుగుకాలువను కబ్జా చేసి దానిపై ఇంటి నిర్మాణం చేపట్టిన వైనం వెలుగుచూసింది.దీంతో జివిఎంసి 75వ వార్డు నెల్లిముక్కు నిర్వాసిత కాలనీ శెట్టిబలిజ వీధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని వాపోతున్నారు.

నెల్లిముక్కు నిర్వాసిత కాలనీ, శెట్టిబలిజ వీధిలోని మురుగుకాలువపై స్థానిక టిడిపి కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అండదండలతో ఇంటి నిర్మాణంచేపట్టారనే విమర్శలున్నాయి. డ్రైనేజీపై ఇల్లు నిర్మాణం చేపట్టడం వలన, మురుగునీరు ప్రవహించకస్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక కాలువతోపాటు రోడ్డును కూడా కబ్జా చేయడంతో 20 అడుగుల రోడ్డు సగానికి కుచించుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఇదే వీధిలో స్టీల్ ప్లాంట్కు చెందిన కోపరేటివ్ స్టోర్ కూడా ఉంది. దానికి వచ్చిపోయేవారు అదనం. ఈ నేపథ్యంలో శెట్టిబలిజ వీధిలో కాలువ కబ్జాతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అధికారులు దృష్టిసారించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇంతవరకు నిర్వాసిత కాలనీకి చెందిన ఖాళీ భూములు కబ్జా కాగా, ప్రస్తుతం రోడ్డు కాలువలు కూడా స్వాహా చేస్తున్నారని స్థానికులు విస్తుపోతున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీలక్ష్మి వివరణ కోరగా, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాకు దన్నుగా ఉన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి తరుపున పులి రమణారెడ్డి వివరణ కోరగా, తామేమీ నిర్మించుకోమని చెప్పలేదని, దానితో తమకు సంబంధం లేదని తేల్చిచెప్పారు.

నిర్వాసిత కాలనీలో కాలువపై నిర్మించిన ఇల్లు.

నివాసాన్ని కూల్చేశారు..

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రధాన రహదారి పక్కన ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒకటో జోన్ మూడో వార్డు పరిధిలోని జివిఎంసి మార్కెట్ దుకాణాల సముదాయం నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉందన్న సాకుతో దానికి తూర్పు భాగంలో కొన్నేళ్ల క్రితం నిర్మించుకున్న రేకుల ఇంటిని ఒకటో జోన్ అధికారులు ఆక్రమణల పేరిట మూడురోజుల క్రితం యంత్రాలతో అన్యాయంగా కూల్చేసారని బాధితులు కొంగరాని అప్పలకొండ, ఆమె అల్లుడు పల్లా భరత్కుమార్ ఆవేదన వ్యక్తం జేశారు.

శుక్ర వారం స్థానిక ప్రెస్క్లబ్లో విలేకరులతో మాట్లాడుతూ, ఏళ్ల తరబడి రేకుల ఇంట్లో నివసిస్తున్న తమ కుటుంబ సభ్యుల అభ్యర్థనను మన్నించకుండా ఏకపక్షంగా ఇంటిని కూల్చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జెడిసి, టౌన్ప్లానింగ్ ఎసిపి, విద్యుత్ సరఫరా కనెక్షన్ను ఉన్న పళంగా తొలగించిన ఎపిపిడిసిఎల్ ఎఇపై ఇప్పటికే న్యాయపరంగా పోరాడుతున్నట్లు వెల్లడించారు.బాధ్యులైన అధికారులపై చట్టపరమైన చర్యలకు లోకాయుక్తను ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు. తమకు న్యాయపరంగా ఉన్న ఇంటి హక్కులను చూపినప్పటికీ అధికారులు దౌర్జన్యంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓట్ల లెక్కింపు కేంద్రంలో కౌంటింగ్ సమయంలో వైసిపి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తం శెట్టి శ్రీనివాసరావు అన్నారు శుక్రవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో వైసిపి ఎన్నికల ఏజెంట్లు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం జేశారు. భీమిలిలో అత్యధిక మెజారిటీతో తాను విజయాన్ని సొంతం చేసుకో బోతున్నట్లు స్పష్టం చేశారు

సమావేశంలో వైసిపి యువజన విభాగం ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త ముత్తంశెట్టి శివ నందీశ్, పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి ముత్తంశెట్టి మహేష్, భీమిలి, పద్మనాభం ఎంపిపిలు దంతులూరి వాసురాజు, కె రాంబాబు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్య నారాయణ, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, పార్టీ నాయకులు, అక్కరమాని చినబాబు, జి వెంకటరెడ్డి, జి మధునాయుడు పాల్గొన్నారు

మహిళా కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి- వేపగుంట : అనారోగ్యంతో మద్రిపాలెం కమలా నర్సింగ్హోంలో చికిత్స పొందుతున్న జివిఎంసి 52వ వార్డు పాత కరాసకు చెందిన వైసిపి మహిళా కార్యకర్త షకీలాభానును విశాఖ నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి మహిళా కార్యకర్త ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

యువతలో కళా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్ర వ్యాప్తంగాయువతలో ఉన్న కళాప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎయు పూర్వ విద్యార్థుల సంఘం సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలతో కూడిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎయు విసి మాట్లాడుతూ మానవ సంబంధాల బలోపేతానికి కళలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ దిశగా యువతను నడిపించడానికి, వారిలోని ప్రతిభను ప్రోత్సహించడానికి తొలి ప్రయత్నంగా దీనిని చేపడుతున్నామన్నారు. ఫైనల్ కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తామన్నారు. ఎయు ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ఎంటర్టైన్మెంట్ క్యూబ్ నెట్వర్క్స్ సంస్థతో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ మూడు అంశాలలోపోటీలు జరుగుతాయన్నారు. ఎటువంటి ప్రవేశ రుసుము లేకుండా, అన్ని వయసుల వారు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు.

కార్యక్రమం నిర్వాహకులు, నటుడు షాహిద్ అబ్బుల్ మాట్లాడుతూ ఎపి, తెలంగాణ రాష్ట్రాలలో దీనిని నిర్వహిస్తున్నామన్నారు. ఎపిలో జూన్ 15 వరకు, తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్కు అనుమతిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలచిన వారికి ఫైనల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు ద స్టార్ ఆఫ్ ఇండియా ఇన్స్టా పేజ్ను సందర్శించాలని సూచించారు. ఫైనల్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సంగీత దర్శకుడు రఘు కుంచె హాజరవుతారు. అరుదైన గ్రామీణ కళలను సైతం వెలికితీసి ప్రోత్సహించడం కార్యక్రమం లక్ష్యమన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో టాలెంట్ హంట్ చేసే విధంగా నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కళలకు నిలయంగా నిలచే ఎయుయ దీనిలో భాగమవుతుందని వెల్లడించారు.

నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి

బడిబయట ఉన్న వికలాంగ పిల్లల గుర్తింపు

సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంఇఒ రమణ

ప్రజాశక్తి- పద్మనాభం : సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల మేరకు సామయ్యవలస, మునివానిపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న 18ఏళ్లలోపు బడిబయట ఉన్న వికలాంగ పిల్లల గుర్తింపు, నమోదు సర్వే కార్యక్రమాన్ని ఎంఇఒ పొన్నగంటి రమణ పర్యవేక్షించారు.

సమగ్రశిక్ష ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 0–18ఏళ్ల వయస్సు కలిగిన 21 రకాల వికలాంగ పిల్లల గుర్తింపు నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. సమగ్రశిక్ష విశాఖ జిల్లా ఎపిసి సూచనల మేరకు ఈనెల ఒకటో తేదీనుంచి మండలంలోని ప్రత్యేక ఉపాధ్యాయుల ద్వారా వికలాంగ పిల్లల గుర్తింపు చేపడుతున్నారు. ఈ సందర్భంగా వికలాంగ పిల్లలకు భవితా కేంద్రాల ద్వారా అందిస్తున్న చదువు, ఇతర ప్రయోజనాలను, ఫిజియోథెరపీ సేవలను, ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపకార వేతనాలు, ఇతర రాయితీలను వికలాంగ పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. వారందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సాహిస్తున్నారు. వచ్చేనెల9 వరకు సర్వే కొనసాగుతుందని ఎంఇఒ రమణ తెలిపారు. మండలంలో ఇప్పటివరకు చేపట్టిన సర్వేలో 12మంది వికలాంగ బాలలను గుర్తించి, వారి వివరాలను నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ రమణతోపాటు ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్. రాజ్కుమార్. ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

భీమునిపట్నం : ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపులో భాగంగా జివిఎంసి మూడో వార్డు ఎగువ పేటలో ఎంఇఒ–2 జయప్రద, భవిత విద్యా వనరుల కేంద్రం శిక్షకురాలు కెజియా కుమారి తదితరులు శుక్రవారం పర్యటించారు. బడి బయట ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

మృతురాలు నవ్య (ఫైల్)

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి గోకార్ట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ చక్రాల కింద పడి మహిళ దుర్మరణం పాలైంది. వివరాలివి. ఎల్ కోట మండలం గనవాడ గ్రామానికి చెందిన సామర్ల నవ్య 40)తన కుమార్తెకు నారాయణ స్కూల్లో అడ్మిషన్ కొరకు తన కుమారుడు రాజుతో కలిసి బైక్ పై వస్తుండగా, వెల్లంకి గోకార్ట్ సమీపంలో హైవేపై హైదరాబాద్ నుండి రాంచి చాక్లెట్ లోడ్తో వెళ్తున్న లారీ అతివేగంతో వచ్చి, అదుపు తప్పి బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ బోల్తా పడి, లారీ చక్రాల కిందకు దూసుకుపోవడంతో, చక్రాల కింద పడి నవ్య అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజు, కుమార్తె యూన్సీలకు స్వల్ప గాయాలు కాగా, స్థానిక ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

కుమార్తె యూన్సీ ను కార్పొరేట్ పాఠశాలలో చదివించాలని ఆశతో అడ్మిషన్ కోసం వస్తుండగా మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందడంతో ఆ కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆనందపురం పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టానికి భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపల లోడు లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం ఎన్ఎస్ఆర్ఐటి కళాశాల ఎదురుగా శుక్రవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో చేపల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా చేబ్రోలు మండలంనారాయణపురం నుండి బీహార్ వెళ్తున్న చేపల లోడ్లారీ శొంఠ్యాం గ్రామం దరికి చేరుకునే సరికి తెల్లవారుజామున డివైడరును ఢీకొని ప్రమాదం బోల్తా పడింది. ఘటన సమయంలో ఈ మార్గంలో ఎటువంటి వాహనాలు రాకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. అయితే లారీ డ్రైవర్, క్లీనర్కు స్వల్పగాయాలయ్యాయి. వేకువజామున డ్రైవర్ నిద్రమత్తుకు జారుకోవడం వల్ల ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో ఆనందపురం పోలీస్లు సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన చేపల బాక్స్లను వేరొక లారీలోకి ఎక్కించి, ట్రాఫిక్ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యక్తి అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని సిఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివి. జివిఎంసి ఐదోవార్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన పి.కల్యాణ్ కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లిన కల్యాణ్ ఇప్పటివరకు తిరిగి రాలేదు. దాంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కలా, బంధువులు ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్యాణ్ తల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు హెచ్సి శ్రీనివాస్ కేసు నమోదు చేశారని, దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -మధురవాడ: గంజాయితో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్కు తరలించినట్లు సిఐ వై. రామకృష్ణ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం, భీమిలి ప్రాంతానికి చెందిన జయరాం, మధురవాడ దుర్గానగర్ చెందిన అఫ్జాద్, కె3 కాలనీకి చెందిన రాజు ముగ్గురూ కలిసి మారికవలస శివాలయం ప్రాంతం వద్ద సుమారు రెండు కిలోల గంజాయితో సంచరిస్తున్నట్లు పిఎం పాలెం పోలీసులకు సమాచారం వచ్చింది. అందిన సమాచారం మేరకు అక్కడికి చేరుకుని గాలించగా, ముగ్గురు నిందితులను గంజాయితో ఎస్ఐ సురేష్, ఇతర పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారని సిఐ తెలిపారు.

వీల్‌చైర్ వితరణ

వీల్‌చైర్ అందజేస్తున్న గణేష్

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు బిలాల్ కాలనీ కాలనీకి చెందిన నీలాపు గౌరి అనే వ్యక్తికి వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేరువ గణేష్ శుక్రవారం వీల్‌చైర్ వితరణగా అందజేశారు. భిక్షాటనతో జీవనం సాగిస్తున్న గౌరి , ఎన్నికల ప్రచార సమయంలో తనకు వీల్‌చైర్ కావాలని అడిగారని, అయితే తాను అనారోగ్యానికి గురికావడం, ఇతరత్రా కారణాలతో ఇప్పటివరకు ఇవ్వడం కాలేదని, శుక్రవారం తన ఇంటివద్ద గౌరికి వీల్‌చైర్‌ను అందజేసినట్లు గణేష్ తెలిపారు. భిక్షాటనతో జీవనం సాగిస్తున్న గౌరి, తన వీల్‌చైర్ పాడవ్వంతో ఇబ్బందులు పడుతున్నానని ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మేరువ గణేష్‌ను అభ్యర్థించగా, అప్పట్లో వీలు చిక్కకపోవడంతో ఇపుడు అందజేసినట్లు తెలిపారు.

26న గీతం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశపరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్) 2024 ను ఆదివారం ఈ నెల 26న దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో లభించిన మార్కుల ఆధారంగా ఆయా కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు గీతం రిజిస్ట్రార్ వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామన్నారు. గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడంతోపాటు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడానికి, విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను (జిసిజిసి)ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. కాగా ఈ ఏడాది గీతంలో ప్రవేశాలకు విశేష స్పందన లభించింది.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత

మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్

ప్రజాశక్తి -ఆనందపురం: జంతువులు ద్వారా మనుషులకు వచ్చే వ్యాధులు అరికట్టడానికి అన్ని శాఖల సమన్వయంతో ఐక్యకార్యాచరణ అవసరమని వన్ హెల్త్ కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రదీష్ అన్నారు. జంతు సంబంధిత వ్యాధుల పరిశీలనకు అవసరమైన ప్రణాళిక తయారీకి శుక్రవారం ఆయన నేతృత్వంలో ముగ్గురు సభ్యులకమిటీ గంభీరం, వేములవలస హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లను సందర్శించారు. పిహెచ్‌సిల డాక్టర్లు, పశువైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమై పలు అంశాల్లో చర్చించి, సూచనలు చేశారు.రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సందర్శన అనంతరం దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి, జంతువుల ద్వారా మనుషులకు వచ్చే వ్యాధుల నివారణకు కృషి చేస్తామని ప్రదీష్ అన్నారు.కార్యక్రమంలో పశు వైద్య నిపుణులు డాక్టర్ రమ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ జగదీష్ చంద్రప్రసాద్, ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ ఎం గంగునాయుడు, షహనాజ్ సాదియా, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్, ఎపిడెమిక్ సెల్ హెల్త్ అసిస్టెంట్ సోమేష్ పాల్గొన్నారు

కొండవాలులో... తాగునీటికి కటకట!



ఎఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ కొండవాలు ప్రాంతం

- నగరం నడిబొడ్డున ఉన్నా ఊట కుంటల్లోని నీరే దిక్కు
- నాలుగు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, నేతలు
- ఇదీ ఎఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ వాసుల దుస్థితి

విశాఖ నగర నడిబొడ్డున పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు నివాసముంటున్న ప్రాంతంగా జివిఎంసి 14వ వార్డు సీతమ్మధార ప్రాంతం ప్రసిద్ధి. ఇంతటి ప్రాముఖ్యత, పేరు ప్రఖ్యాతులున్న ప్రాంతంలో కొండవాలులను ఆనుకుని ఉన్న ఎఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు దశాబ్దాలుగా తాగునీటికి అల్లాడిపోతున్నారంటే కాస్తంత ఆశ్చర్యం కలగక మానదు. అయినా ఇది నిజం. ఏళ్ల తరబడి తమ సమస్యను అధికారులు, నేతల దృష్టికి తీసుకెళ్లడం, కొన్ని సందర్భాల్లో ధర్నాలు, ఆందోళనలు చేసినా, హామీలే తప్ప తమ సమస్య పరిష్కారం కాలేదని వీరంతా ఆవేదన చెందుతున్నారు.

కాలనీ వాసులకు కొండపైనున్న ఈ ఊటకుంటే తాగునీటి ఆధారం!

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి14వ వార్డు ఎఎస్ఆర్, నగర్, బిలాల్ కాలనీ ప్రాంతాల్లో 350 కుటుంబాలు నివాసముంటున్నాయి. మూడున్నర, నాలుగు దశాబ్దాల క్రితం ఆయా కాలనీలు ఏర్పాటైన నాటి నుంచి తాము తాగునీటికి అల్లాడిపోతున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ, నేటికీ తాము కొండపైనుంచి వచ్చి, ఊటకుంటల్లో చేరిన నీటితోనే నేటికీ అవసరాలు తీర్చుకోవాల్సిన దుస్థితిలో ఉన్నామని ఆవేదన చెందుతున్నారు. అదికూడా రెండు మూడు బిందెలకు మించి రావడం కష్టమౌతోందని వాపోతున్నారు.

జివిఎంసి ద్వారా సగటున 30, 40 ఇళ్లకు ఒక్కో కుళాయి ఏర్పాటు చేసినప్పటికీ, కొండవాలు కావడంతో వాటిల్లోకి బెక్కుతూ వచ్చిన నీరు ఎటూ, ఎవరికి సరిపోవడం లేదని అంటున్నారు. నీరు ఎపుడు వస్తాయా అంటూ కళ్లు కాయలు కాచేలా చూస్తూ, కుళాయిల వద్ద కుస్తీలు పడితే ఒకటిరెండు బిందెల నీరే దక్కుతుందని, అది ఎటూ చాలడం లేదని అంటున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసినా, దాని నిర్వహణలో చిత్తశుద్ధి లేమితో ప్రయోజనం లేని పరిస్థితి ఉందని ఆరోపిస్తున్నారు.

తాగునీటికోసం తాము పడుతున్న అవస్థలను పలుమార్లు అధికారులు, నేతలకు విన్నవించామని, నలభై ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు, ఎందరో అధికారులు మారినా, తమ నీటి సమస్య మాత్రం అలాగే ఉందని ఆవేదన చెందుతున్నారు. తాగునీటి కోసం రాజకీయ నేతల ఇళ్ల ముట్టడి, అధికారులకు వినతిపత్రాల అందజేత, పలుమార్లు ధర్నాలు, ఇతరత్రా ఆందోళనలు చేపట్టినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. జలజీవన్ మిషన్ వంటి పథకాలేవీ మాదరికి రాలేదని వారంతా ఆవేదన చెందుతున్నారు. అంతర్జాతీయ నగరంగా ప్రసిద్ధి చెందిన విశాఖ నడిబొడ్డున తాము పడుతున్న నీటి కష్టాలపై ఇప్పటికైనా స్పందించాలని ఎఎస్ఆర్ నగర్, బిలాల్ కాలనీ వాసులు మొరపెట్టుకుంటున్నారు. ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టి, కొండవాలు ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీటిని అందించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

బంధువులెవరూ రారు

35ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నాం. నాటి నుంచి నేటి వరకు తాగునీటికి పడుతున్న కష్టాల్లో మార్పులేదు. మా దుస్థితిని చూసి బంధువులెవరూ మా ఇళ్లకు రావడం లేదు. నగరం నడిబొడ్డున ఉన్నా నీరు లేదని చెప్పుకోవడానికి సిగ్గుగా ఉంది..

చుక్క మార్తమ్మ, కాలనీవాసి

ఇంకెన్నాళ్లీ కష్టాలు!

30ఏళ్లుగా కొండపైనుంచి వచ్చే ఊటనీటితోనే కాలం వెల్లదీస్తున్నాం. కుళాయిలు, ఇతరత్రా మార్గాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇంకెన్నాళ్లీ కష్టాలు భరించాలో అధికారులు, నేతలే చెప్పాలి.

కోరాడ పార్వతి కాలనీవాసి

మా గోడు పట్టించుకోరేం

ఓట్ల కోసం వస్తున్న నేతలంతా తాగునీటికి మేము పడుతున్న కష్టాలను ఇన్నేళ్లయినా పట్టించు కోక పోవడం దారుణం. చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగులతో నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పటికైనా స్పందించండి. కుళాయిలు వేసి తాగునీరు అందించండి

రవణమ్మ, కాలనీవాసి

ప్రాంగణ నియామకాల్లో పలువురికి ఉద్యోగాలు

ప్రజాశక్తి -గాజువాక: గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం టెక్ మహేంద్ర సంస్థ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాలేజీకి చెందిన రెండు వందల మంది విద్యార్థులు హాజరుకాగా, టెక్ మహేంద్ర సంస్థ ప్రతినిధులు సాయికిరణ్, ఫజీర్, అమిత సంస్థ సిఇఒ డాక్టర్ డివి రామకోటిరెడ్డి పాల్గొని, విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.వీరిలో వందమందిని వివిధ జాబ్‌లకు ఎంపిక చేసినట్లు టెక్ మహేంద్ర ప్రతినిధులు సాయి కిరణ్, ఫజీర్ తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 130 మంది ఎంపిక

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్ర వారం వివిధ సంస్థలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో కళాశాల ఫైనలియర్ విద్యార్థులు 130 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మెగా ఇంజినీరింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డైకిన్, కోకోకోలా, హెచ్ఎంఐఇఎస్, విశాఖ సినర్జీస్ కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగ విజయోత్సవం పేరిట నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో జివిఎంసి జోనల్ కమిషనర్ కె కనకమహాలక్ష్మి మాట్లాడుతూ, ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసి, అభినందించారు.కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు నియామకపత్రం ఇస్తున్న జెడ్‌సి

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : పద్మనాభపురంలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా ఈ నెల 25న శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పద్మనాభపురం, జివిఎంసి వాటర్‌వర్క్స్, బంటా కాలనీ 11కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఆయా ఫీడర్ల పరిధిలోని పద్మనాభపురం, నందమూరినగర్, జనతా కాలనీ, కంపరపాలెం, బంటాకాలనీ, మేఘాద్రినగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఇఇ కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

ప్రజాశక్తి - ఆరిలోవ : వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాటిని అతిక్రమిస్తే శిక్షార్హులవుతారని ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. శుక్రవారం హనుమంతువాక వద్ద శ్రీ హనుమాన్ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులతో సమావేశమై, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఏకరూప దుస్తులు ధరించాలని, మద్యం మత్తులో వాహనం నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, అతివేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయరాదన్నారు.

ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా వాహన లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హనుమాన్ ఆటో స్టాండ్ అధ్యక్షులు సూరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిన భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం

- ★ రూ.101 కోట్లుతో చేపట్టిన పనులు మధ్యలో ఆగిపోయిన వైనం
- ★ పైపులైన్ల కోసం తవ్విన గోతులతో ఛిద్రమైన రోడ్లు
- ★ మూలకు చేరిన పైపులు

స్టేషన్‌రోడ్డులో మూలన మూలుగుతున్న రక్షిత మంచినీటి పథకం పైపులు

ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీటిని పట్టుకుంటున్న స్థానికులు

ప్రజాశక్తి - యలమంచిలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు భారీ మంచినీటి పథకాలు ప్రకటించాయి. చిరకాల వాంఛ తీరుతుందన్న సంతోషంతో యలమంచిలి పట్టణ ప్రజలు ఎగిరి గంతులు వేశారు. అయితే యలమంచిలి మున్సిపాలిటీకి మంజూరు చేసి భారీ తాగునీటి పథకం నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

యలమంచిలి మున్సిపాలిటీ ప్రాంతంలో పూర్తి స్థాయి తాగునీటి అవసరాలు తీర్చే విధంగా, ఇంటింటికీ కుళాయి సమకూర్చడానికి రూ.101 కోట్ల నిధులతో భారీ రక్షిత మంచినీటి పథకాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. 2022 ఆగస్టులో మంజూరు చేసిన ప్రభుత్వం రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పింది. ఈ లెక్కన మరో మూడు నెలల్లో తాగునీటి పథకం నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. పథకంలో భాగంగా రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించి పట్టణంలోని 12,037 ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. ఆర్భాటంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే భూమి పూజలు కూడా చేసి పనులు ప్రారంభించారు. టన్నుల కొద్దీ పైపులు కూడా వచ్చాయి. చక్కగా ఉన్న సిమెంట్ రోడ్లను సైతం అడ్డంగా పగల గొట్టి కాలువలు తవ్వి పైపులైన్ వేశారు. కొన్ని ప్రాంతాల్లో పైపులు వేయగా, చాలా ప్రాంతాల్లో ఇంకా వెయ్యకుండానే పనులు ఆపేశారు. నిధులు లేవంటూ నాగార్జున కనస్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ చేతులెత్తేసి మూటా ముళ్లూ సర్దుకొని వెళ్లి పోయారు. కాలువలు తవ్వేసి వదిలేయడంతో రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. ఈ పాపం ఎవరిదంటూ ప్రజలడిగే ప్రశ్నలకు జవాబిచ్చే నాథులు కరువయ్యారు. మంచినీటి పథకం మాట అటుంచి ఈ వేసవిలో పట్టణ ప్రజలు దాహార్తి తీరే మార్గం కనిపించడం లేదు.

పెరిగిన ఎండ వేడికి, కాలిపోతున్న మోటార్ల పనిభారానికి యలమంచిలి మున్సిపాలిటీ వాసుల దాహార్తి తీరే మార్గం కఠినతరమైంది. రోజుల తరబడి మంచినీటి సరఫరా నిలిచిపోతోంది. మారుమూల ప్రాంతాలకు నీటి సరఫరా గగనమైపోతోంది. అరకొర ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నప్పటికీ అవి పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. రాబోయే ప్రభుత్వ పెద్దలైనా దీనిపై శ్రద్ధ వహించి ఈ భారీ మంచినీటి పథకాన్ని పూర్తి చేసి మున్సిపాలిటీ ప్రజలు దాహార్తి తీర్చాలని పలువురు కోరుతున్నారు.

మున్సిపల్ అధికారుల వివరణ

ఎన్నికల కోడ్ మూలంగా ఇక్కడి ఇంజనీరింగ్ అధికారులు అనకాపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారు వస్తే గాని పథకం వివరాలు తెలిసే అవకాశం లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ విధాన పరమైన నిర్ణయాలకు తావులేదు. ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్న పథకం కాబట్టి నిర్ణయాల్లో కాస్త ఆలస్యం జరగొచ్చని అందుబాటులో ఉన్న మున్సిపల్ అధికారులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

57 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-దేవరాపల్లి

కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం దేవరాపల్లిలో శుక్రవారం పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి ఎటువంటి రికార్డులు లేని 55 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కె.కోటపాడు సిఐ సిహెచ్.స్వామినాయుడు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలతో పాటు అధిక సంఖ్యలో పోలీసులు ఒక్కసారిగా మెరుపు దాడులు చేశారు. ఇంటింటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేసి, రికార్డుల్లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాలకు సంబంధించిన రికార్డులను చూపించి వాహన యజమానులు తమ వాహనాలను తీసుకువెళ్లవచ్చని ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

క్రీడాకారుడు గణేష్‌ను అభినందిస్తున్న రమేష్

వికలాంగ క్రీడాకారునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

వరల్డ్ బీచ్ పారా ఒలింపిక్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికైన వికలాంగ క్రీడాకారుడు అన్నం గణేష్‌ను అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిహెచ్.రమేష్ శుక్రవారం తన ఎన్నికల కార్యాలయంలో ఘనంగా సత్కరించి, ఆర్థిక సాయం అందించారు. ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు శివారు పాత సోముదేవుపల్లికి చెందిన వికలాంగ యువకుడు అన్నం గణేష్ పారా వాలీబాల్ జాతీయ జట్టుకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బీజేపీ సైనిక్ సెల్ కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-అచ్యుతాపురం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణకు పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం బుచ్చిరాజు పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర కోలాటం పోటీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో అభయాంజనేయ జయంతోత్సవాలు సందర్భంగా అంతర్రాష్ట్ర కోలాట పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బి.శెట్టి రాము మాట్లాడుతూ ఈ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయని, పది రోజులపాటు జరుగుతాయని తెలిపారు. ఉదయ రాష్ట్రాల నుంచి ప్రత్యేక ఆహ్వాన కోలాట బృందాల విచ్చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

కోలాటం పోటీల్లో పాల్గొన్న మహిళలు, బాలికలు

కొణతాలతో మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు మురళి

కొణతాలను కలిసిన మురళి

ప్రజాశక్తి- కశింకోట

అనకాపల్లి నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణను టిడిపి మండల అధ్యక్షులు కాయల మురళి శుక్రవారం కలిశారు. ఎన్నికల కౌటింగ్‌పై చర్చించారు. మండలంలో జరిగిన ఓటింగ్ విధానం కూడా విశ్లేషణ అంచనాపై మాట్లాడారు. మురళి వెంట ద్వారపురెడ్డి సత్తబాబు ఉన్నారు.

ఇంగ్లీష్ గ్రామర్‌పై శిక్షణ

ప్రజాశక్తి- సబ్బవరం

మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం వార్తా పత్రికల పఠనం, ఇంగ్లీష్ గ్రామర్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆంగ్ల భాషపై విద్యార్థులకు రత్నకుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాధికారి వి.కుమారి శిరీష మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఆంగ్లభాషలో పట్టు సాధించాలన్నారు. పుస్తక పఠనం వలన విద్యార్థులు మేధోసంపతిని పెంపొందించుకోవచ్చని చెప్పారు.

ఇంగ్లీష్ గ్రామర్ బోధిస్తున్న రత్నకుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

విద్యార్థులతో తల్లిదండ్రులను కలిసిన ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, ఉత్తమైన బోధన ఉంటుందని, పిల్లలను ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఊరంతా తిరిగి పిల్లల తల్లి దండ్రులకు అవగాహనా కలిపిస్తున్నారు. శుక్రవారం మండలంలోని దిబ్బిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాడపల్లి రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు పోలవరపు కాసులక్ష్మి 2024-25 విద్యా సంవత్సరానికి 1, 2 తరగతుల ప్రవేశాలకు ఇంటి ఇంటికి వెళ్లి పిల్లల వివరాలు సేకరించారు. అంగనవాడి విద్యను పూర్తి చేసుకున్న తర్వాత 1, 2 తరగతులకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అన్ని వసతులతో దిబ్బిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిల్లలు తల్లి దండ్రులకు సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

తాము చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి ఉన్నత స్థితిలో ఉన్న పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ముర్రు ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి గణపతిరాజు లక్ష్మీనరసింహరాజు తన మాతృమూర్తి పేరున రూ.9 లక్షలు వెచ్చించి చక్కని సభావేదిక నిర్మించారు. దీనిని శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముత్యాలనాయుడు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు సేవ చేయాలన్న ఉద్దేశంతో సొంత నిధులు వెచ్చించి సభా వేదిక నిర్మించడం ఎంతో గొప్ప విషయమన్నారు. అంతకుముందు సృజన వాణి వ్యవస్థాపక అధ్యక్షులు రాళ్లపల్లి రవికుమార్ సభా వేదికను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బిర్లంగి రామ నరేష్, స్థానిక హెచ్ఎం ఈర్లే అప్పారావు, పూర్వ విద్యార్థులు దాట్ల చంద్రశేఖర వర్మ, జిజి శర్మ, ఆవుగడ్డ పాత్రుని నాయుడు, కొణతాల సూర్యనారాయణ, గొరుపోటు రామ్మూర్తి, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, బొడ్డేడ నాగరాజు, దాడి వెంకట సూర్యనారాయణ, 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహరాజును సత్కరిస్తున్న దృశ్యం

విద్యార్థిని కలిసి ఇంటర్‌లో చేరాలని కోరుతున్న ఉపాధ్యాయులు

జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్

31వ తేదీ లోగా దరఖాస్తుల చేసుకోవాలి : హెచ్‌ఎం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చెందినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం పద్మావతి తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మే 31 తేదీలోగా దరఖాస్తు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా కళాశాలలో ప్రవేశానికి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాబార్డు డిడి కుమార్

కలిసికట్టుగా పనిచేస్తే అధిక లాభాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పాడి రైతులు కలిసికట్టుగా పనిచేస్తే అధిక లాభాలు సాధించవచ్చని నాబార్డు డిప్యూటీ డైరెక్టర్ మార్కెటింగ్ సమంత కుమార్ చెప్పారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో శుక్రవారం నెహ్రూ యువజన సంఘం, జన మిత్ర మ్యాక్స్ సంయుక్తంగా కెఎస్‌ఆర్ ట్రైనింగ్ సెంటర్‌లో పాల ఉత్పత్తిదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన సమంత కుమార్ మాట్లాడుతూ ఒక్కొక్కరు పాడి పశువులను విడిగా పోషించేకంటే కంపెనీగా ఏర్పడి పరిశ్రమ స్థాయిలో వ్యాపారం చేసి అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జన మిత్ర సీఈవో కె రమేష్ బాబు, చైర్‌పర్సన్ కరణం కాంతమ్మ, జన్మిత్రా మ్యాక్స్ మేనేజర్ ఐఆర్‌వి అప్పారావు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శరణం శ్రీనివాసరావు, జన్మిత్రా డైరెక్టర్ మల్ల జయలక్ష్మి, ఎస్బిఐ మేనేజర్లు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి బండారు, పంచకర్ల పరామర్శ

ప్రజాశక్తి- సబ్బవరం

ఇటీవల అనారోగ్యం బారిన పడి ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జి గండి బాబ్జిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. బాబ్జి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పెందుర్తి, సబ్బవరం మండలాలకు చెందిన జనసేన నేతలు కూడా గండి బాబ్జిని కలసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడా మహాలక్ష్మి నాయుడు, నాయకులు రెడ్డి నారాయణరావు, మామిడి శంకరరావు, కర్రి నర్సింగరావు, టి. శేఖర్, బంతికోళ్ల పద్మ, బలిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

గండి బాబ్జి యోగక్షేమాలు తెలుసుకుంటున్న పంచకర్ల

ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.300 ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి

ప్రజాశక్తి-పరవాడ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.300 చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఈ భోనంగి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం సమావేశమై మాట్లాడారు. ఏరోజు ఎంత వేతనం పడుతుందో తెలుసుకునే విధంగా పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి రూ.300 కూడా పెరిగిన ధరలకు అనుగుణంగా లేదని, ఆ ప్రకటించిన కూలి డబ్బులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఎండవేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, 30 శాతం వేసవి అలవెన్సు ఇవ్వాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి కూలి డబ్బులు చెల్లించాలని, ప్రతి కుటుంబానికి ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ బోనంగి ఉపాధి హామీ కూలీలు శేషమ్మ, అప్పారావు, రమణ, లక్ష్మి, అప్పల నరసింహ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

కరాటేతో దేహ దారుఢ్యం, ఆత్మరక్షణ

కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి- అనకాపల్లి

కరాటే దేహ దారుఢ్యంతో పాటు ఆత్మరక్షణకు దోహదపడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలోని వివి.రమణ రైతుభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిజి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా, నాయుడు సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో కరాటేపై నిర్వహించిన కుమిటె సెమినార్‌కు జపాన్‌కు చెందిన 10వ బ్లాక్ బెల్ట్ డాన్, హ్యాన్షి, షుకొకాయ్ ప్రపంచ కరాటే యూనియన్, ర్యూన్షిన్‌కాన్ అంతర్జాతీయ కరాటే ఫెడరేషన్ అధ్యక్షులు సొకేటకేషి మసుయమ, హ్యాన్షి, 9వ బ్లాక్ బెల్ట్ డాన్, కెన్షొబుడో క్యొకాయ్ వ్యవస్థాపక చైర్మన్ ప్రొఫెసర్ వి.పూజారి, ఎన్.ఎస్.ఎస్.కె.ఎ.ఐ. టెక్నికల్ అడ్వైజర్, షిహాన్ వి.రవీందర్‌కుమార్ హాజరయ్యారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రత్నాకర్ మాట్లాడుతూ ఈ వేసవి సెలవులను విద్యార్థులు వృథాగా పోనివ్వకుండా దేహదారుఢ్యంపై దృష్టిసారించాలని, కరాటే, కుంగ్‌ఫూ వంటి క్రీడలు ఇందుకు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రముఖ సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్, శిలపరశెట్టి బాబ్జి, అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పల్నాడు, రాయలసీమ దాడులపై

గవర్నర్ మౌనం రాష్ట్రానికి మంచిది కాదు

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న దాడులు, దాష్టీకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరిగి, రాష్ట్ర ప్రతిష్ట దిగజరిపోతుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మౌనం వహించడం సరికాదని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. అనకాపల్లి రింగురోడ్డు జనసేన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన తరువాత ఎప్పుడూ జరగని అల్లర్లు, దాడులు, దాష్టీకాలు ఇప్పుడే జరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవ్వరూ ఊహించని రీతిలో జరిగిన దాడుల వలన రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కౌంటింగ్ తరువాత జరిగే పరిస్థితిని అంచనా వేసి పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలు ఇప్పటికే గ్రామాలు వదిలి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు ఎన్నికల్లో పాల్గొని విధులు నిర్వహిస్తున్న ఆర్వోలు, పిఓలు, ఏపీఓలు విధులు నిర్వహించలేక భయపడుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ తక్షణమే స్పందించి ప్రధాన రాజకీయ పార్టీ నేతలను పిలిపించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అడపా నరసింహంమూర్తి, కనుబుడ్డి నరసింగరావు, కొలసాని రమణ పాల్గొన్నారు.

పూర్తిగా కాలిబూడిదైన చెరుకు తోట

చెరుకు తోట దగ్ధం

ప్రజాశక్తి-దేవరాపల్లి

దేవరాపల్లి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో కొల్లి దొంగబాబుకు చెరుకు తోట దగ్ధమైంది. దేవరాపల్లికి చెందిన కొల్లి దొంగబాబు అనే రైతుకు చెందిన చెరుకు తోటలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. కల్లానికి చెరుకు తోటకి దూరం కావడంతో మంటలు వ్యాపించడం తెలియరాలేదు. 50 సెంట్లులో వేసిన చెరుకు తోట పూర్తిగా కాలిబూడిదైంది. పొలానికి నీరు పెట్టడానికి వేసిన పైపులు కూడా పూర్తిగా కాలిపోయాయి. దీంతో రైతు కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గత ఏడాది ఇదే చెరుకు తోట ద్వారా లక్షా 50వేల రూపాయలు వచ్చిందని బాధిత రైతు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తనకు తగు న్యాయం చేయాలని రైతు కోరారు.

చోడి చెరువులో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కొక్కిరాపల్లి శివారులో తురంగలపాలెం మార్గంలోని చోడి చెరువులో మూడు నాలుగు రోజులు క్రితం మరణించిన పురుషుడి మృత దేహం శుక్రవారం గుర్తించినట్లు స్థానిక రూరల్ పోలీసులు తెలిపారు. 30- 35 సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, ఇటీవల కాలంలో ఈ వయస్సు వారు తప్పి పోయిన సంఘటనలు ఉంటే వారి కుటుంబీకులు వచ్చి గుర్తు చూడాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డైట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ అటానమస్ కళాశాలలో శుక్రవారం టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ హెడ్ పి.రవి కుమార్, ధనశ్రీ డైట్ కళాశాలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. డైట్ కళాశాలకు చెందిన 240 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 110 మంది రాత పరీక్షలో ఉతీర్ణులయ్యారు. తదుపరి టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహించగా 57 మంది తదుపరి హెచ్‌ఆర్ ఇంటర్వ్యూకి అర్హత సాధించారు. హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఆన్లైన్‌లో నిర్వహిస్తామని టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన ట్రైనింగ్ హెడ్ పి. రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ డైట్‌తో చాలా సాఫ్ట్వేర్ కంపెనీలు ఎంపానెల్ చేసుకున్నారని, తద్వారా విద్యార్థులకు మరిన్ని ఎక్కువ నియామకాలు జరగనున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంతరావు మాట్లాడుతూ టెక్నిక్స్ ఇంటెగ్రేషన్ టెక్నాలజీస్ కంపెనీ మల్టీ నేషనల్ కంపెనీలో ఒకటి అని, దానికి విద్యార్థులు అందరూ తమ ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ అకాడెమిక్స్ డాక్టర్ కే.పార్వతి, ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ వై హేమంత్ కుమార్ మాట్లాడారు. అనంతరం టెక్నిక్స్ కంపెనీ ట్రైనింగ్ హెడ్ రవి కుమార్‌ను సహాయక సిబ్బందిని చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ వైకుంతరావు ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్యాం ప్రసాద్, డీన్ ఎకడమిక్స్ డాక్టర్ పార్వతి, డాక్టర్ ఈశ్వర రావు, అకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, టి.పి.ఓ హేమంత్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపల్ తదితరులు

దిగిరాని కూరగాయల ధరలు

ప్రజాశక్తి -నక్కపల్లి: గత ఐదారు నెలల నుండి కూరగాయల ధరలు దిగిరాలేదు. వేసవి కావడంతో పంట దిగుబడి తగ్గినప్పటికీ కొన్ని కూరగాయల ధరలు కిలో 10 నుండి 20 రూపాయలు పెరిగినప్పటికీ మిగిలిన కూరగాయ ధరలు ఎప్పటిలాగానే ఉన్నాయి. ఉల్లి కిలో ఒక రకం రూ.25, మరో రకం పెద్దవి రూ.30 చొప్పున మార్కెట్లలో విక్రయిస్తున్నారు.రెండు వారాల క్రితం కిలో రూ.20 లకు లభించే ఉల్లి ,కాస్త పెరిగింది. క్యారెట్ కిలో రూ.40 నుండి రూ.50 లు, బీట్రూట్ కిలో రూ.40 నుండి రూ.50లు, బెండ కిలో రూ.60లు, బీర కిలో రూ.60, బంగాళాదుంపలు కిలో రూ.30 చొప్పున మార్కెట్లో విక్రయిస్తున్నారు. రెండు వారాల క్రితం టమోటా కిలో రూ.20 నుండి రూ.30 ఉండగా, ప్రస్తుతం కిలో రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. దొండ కిలో రూ. 30, మిర్చి కిలో రూ.60, అల్లం కిలో రూ.160 ధరలు ఉన్నాయి. బెండ, బీరకాయ ధరలు అధికంగా ఉండటంతో వాటిని కొనుగోలు చేసుకునేందుకు వినియోగదారులు వెనక్కి తగ్గుతున్నారు. కూరగాయల ధరలు ఎప్పటిలాగే దిగి రాకపోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు అర, పావు కేజీ చొప్పున కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

మాట్లాడుతున్న ఆర్ఓ గీతాంజలి

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: జూన్ 4న నిర్వహించే ఓట్ల లెక్కింపును నిబద్ధతతో, నిర్భయంగా అప్రమత్తంగా నిర్వహించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే గీతాంజలి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమావేశం నిర్వహించి కౌంటింగ్ విధి, విధానాలపై అవగాహన కల్పించారు. పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుల్లు ఏర్పాటు చేస్తున్నామని, 22 రౌండ్ల లెక్కింపు ఉంటుందన్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, తర్వాత ఈవీఎంల లెక్కింపు ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రాంతంలోనూ, మీడియా సెల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించాల్సిన విధులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ఓలు శ్రీకాంత్, సూర్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రత్నం అధ్యక్షతన ఈనెల 25న శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటల కు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

14 కేంద్రాల్లో నేడు డిప్యూటీ డిఇఓ పరీక్ష

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిప్యూటీ డిఇఓ పరీక్ష శనివారం జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాలలో జరుగుతుందని విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. పరీక్ష ఉదయం 9.00 నుంచి 11.30 గంటల వరకు ఉంటుందని, 4,498 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా ఏర్పాట్లుపై శుక్రవారం ఆయన తన ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షను నిర్వహించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించాలని, ప్రక్రియను విజయవంతం చేయాలని సూచించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేందుకు పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని అన్నారు. సమావేశంలో ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్ రవి, ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందిస్తా

మాట్లాడుతున్న రాహుఫ్

శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి రాహుఫ్

ప్రజాశక్తి-గొలుగొండ: ఉద్యోగంలో బాధ్యతా యుతంగా ఉత్తమ సేవలు అందిస్తానని శిక్షణ ఐఎఫ్ఎస్ అధికారి మహమ్మద్ అబ్దుల్ రాహుఫ్ అన్నారు. శుక్రవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అటవీ శాఖ రేంజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2022 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు ఎంపికై రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నామన్నారు. దీనిలో భాగంగా కృష్ణ దేవి పేట రేంజ్ పరిధిలో మూడు నెలల పాటు రేంజ్ అధికారి సెక్షన్ అధికారి సిబ్బంది విధులు అటవీ పరిరక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అటవీ పరిరక్షణకై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విధులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే అనకాపల్లి, విశాఖపట్నంలో శిక్షణ పూర్తయిందని, ప్రస్తుతం నర్సీపట్నం డివిజన్లో శిక్షణ నిమిత్తం ఇక్కడకి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి సుంకరి వెంకటరావు, సెక్షన్ అధికారి సుబ్బారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వినతిపత్రాన్ని చూపుతున్న నాయకులు

పాఠశాలల్లో క్రీడా మైదానాల ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు కోరారు. శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. పిల్లలు చదువులకే పరిమితం కాకుండా ఆటలకు సమయం కేటాయించాలన్నారు. పిల్లలకు ఇంటి వద్ద, స్కూల్లో చదువుతో సరిపోతుందని, క్రీడలు, డ్రాయింగ్ పీరియడ్‌లను అమలు చేయాలన్నారు. ఆటపాటలతో పిల్లలు ఉత్సాహంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు సత్యప్రసాద్, కాపు సంఘం మండల అధ్యక్షులు ఇన్నం రమణ, కాపు సంఘం కార్యదర్శి బంటు శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షులు పి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

జిల్లాలో పలు చోట్ల వర్షం

గొలుగొండలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-గొలుగొండ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గొలుగొండ మండలంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికమై ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈదురుగాలుతో కూడిన భారీ వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు సేద తీరారు. వర్షాలకు ఏఎల్ పురం, పాత కృష్ణదేవిపేట తదితర గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్నాయి.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా శుక్రవారంతో మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడి పోయారు.మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అనంతరం ఎడతెరిపి లేకుండా జల్లులు కురుసాయి. వర్షానికి విద్యుత్తు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

తేలిక పాటి చిరు జల్లులు

నక్కపల్లి: ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. వాతావరణం చల్లబడింది. వర్షం కురుస్తుందని అంతా ఎదురు చూశారు. కానీ వరుణుడు కరుణించలేదు. మొక్కుబడిగా నాలుగు చినుకులతో సరిపెట్టాడు. గత కొద్ది రోజుల నుండి ఎండలు మండి పోవడంతో జనం తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. ఇటువంటి సమయంలో శుక్రవారం అధిక ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ పలుమార్లు ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. సాయంత్రానికి కారు మేఘాలుగా మార్పు చెందాయి. దీంతో చల్లటి గాలులు వీచడం ప్రారంభించడంతో వర్షం పడుతుందని అంతా భావించారు. మేఘాలు తేలికపాటి చినుకులు రాల్చి ఉసూరు మనిపించడంతో నిరాశ చెందారు. వాతావరణం చల్లబడడంతో అంతా ఉపశమనం పొందారు.

రోలుగుంట: రోలుగుంటలో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన ఈ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మెయిన్ రోడ్డు వద్ద ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయం కూడలి వద్ద మోకాళ్ల గోతుల్లో నీరు చేరింది. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

బుచ్చయ్యపేట :రెండు రోజులుగా తీవ్రమైన ఎండ విపరీతమైన ఉక్కపోతతో విలువలాడిన ప్రజానీకం శుక్రవారం చిరుజల్లులు కలవడంతో ఉపశమనం పొందారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి తదితర గ్రామాల్లో ఓ మోస్తర్ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కశింకోట : కశింకోట మండలం తాళ్ళపాలెం పరిధిలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. రెండు రోజులుగా ఎండ వేడిమికి అల్లాడుతున్న ప్రజలు సేద తీరారు. ఈ వర్షం దుక్కులు దున్నటానికి, కూరగాయల పంటలకు ఉపయోగ పడుతుందని రైతులు చెబుతున్నారు.

పిడుగు పడి మహిళ మృతి

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని కొమరవోలు గ్రామానికి చెందిన గణేశ్వరి(39) పిడుగుపాటుకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. శుక్రవారం సాయంత్రం పశువులను మేతకు తీసుకు వెళ్ళింది. వాటిని మేపుకుంటూ పొలం వద్ద ఉండగా ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఆ సమయంలో గణేశ్వరిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది.

మహిళ మృతదేహం

విశాఖలో ఎన్నికల తీరుపై హైకోర్టులో పిటిషన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో, ముఖ్యంగా విశాఖలో ఎన్నికలు సజావుగా కొనసాగలేదని హైకోర్టులో తాను పిటిషన్ వేయగా దానిపట్ల హైకోర్టు సానుకూలంగా స్పందించిందని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు, ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి కెఎ పాల్ అన్నారు. శుక్రవారం రైల్వే న్యూ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను వేసిన పిటిషన్ మేరకు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించాలని విశాఖ జిల్లా కలెక్టర్ కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలు ఎందుకు చుట్టు పక్కలా ఏర్పాటు చేయలేదన్నారు. కౌంటింగ్ ప్రదేశంలో 2019లో ఇచ్చిన వెబ్ లింక్స్ ఎందుకు ఇప్పుడు ఇవ్వలేదని ప్రశ్నించారు.

ఆర్ఎంపి వైద్యునికి నోటీసులు

ప్రజాశక్తి-గొలుగొండ:జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉత్తర్వుల మేరకు ఏఎల్ పురం అల్లూరి క్లినిక్ ఆర్ఎంపీ వైద్యుడు రామదాసుకు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు రామదాసుకు నోటీసులను కృష్ణదేవిపేట పిహెచ్సి వైద్యాధికారి హరిప్రవీణ్ అందజేశారు. ప్రధమ చికిత్సకి మించి అన్ని రకాలైన వైద్యం చేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, క్లినిక్‌ను తక్షణమే మూసి వేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నోటీస్ ఇస్తున్న వైద్యాధికారి

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఈనెల 25న శనివారం పవర్ ట్రాన్స్ఫర్‌ల ఏర్పాటుతో రాజపేట, ఎండపల్లి, బీకేపల్లి, కెతంగేడు, రామన్నపాలెం, రామచంద్రపురం గ్రామాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని కోటఉరట్ల మండలం విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నక్కపల్లిలో జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రంను ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు మొదటి రోజు పరీక్ష రాశారు.

సహజ ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రోటీన్ సప్లిమెంట్లు వాడే కన్నా సహజంగా ప్రోటీన్లు అధికంగా కలిగివున్న ఆహారాన్ని తీసుకోవాలని మ్యాక్స్ హెల్త్‌కేర్ క్లినికల్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ రీజనల్ హెడ్ రితికా సమద్దర్ సూచించారు. శుక్రవారం ఉదయం బీచ్ రోడ్‌లోని వాకర్స్ లక్ష్యంగా ఆరోగ్యం - ఆహారం అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కండరాలు, కణజాలాలు, హార్మోన్ల కోసం అత్యంత కీలకమైనది ప్రోటీన్ అని, జీవక్రియ నియంత్రణలో ఇది సహాయ పడుతుందని అన్నారు. రోగనిరోధక పనితీరుకు మద్దతు ఇస్తుందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ కొత్తగా విడుదల చేసిన ఆహార మార్గదర్శకాలు శరీర ద్రవ్యరాశిని నిర్మించడానికి వాటిని ఉపయోగించకూడదని సలహా ఇస్తున్నాయన్నారు.

ఇష్టానుసారంగా పోస్టర్లు అతికిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సుందర మహా విశాఖ నగరంలో నగర గోడలపై, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, రోడ్డు విభాగినిలపై, డస్ట్ బిన్నులపై, ప్రజా ఆస్తులపై పోస్టర్లు అతికించినా, పెయింటింగ్ వేసినా, ఇతర రాసినా సంబంధిత సంస్థలు, ఆర్గనైజేషన్‌లపై చర్యలు తీసుకుంటామని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో విశాఖ నగరంలోని ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ సభ్యులు, మత సంబంధ సంస్థలు, ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సభ్యులతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలు సైతం విశాఖ నగరాన్ని సుందర నగరంగా, పరిశుభ్ర నగరంగా గుర్తిస్తున్నాయన్నారు. నగరానికి నిత్యం సందర్శకులు, పర్యాటకులు వేలాది మంది వస్తున్నారని తెలిపారు. ఆ సుందర వాతావరణాన్ని పాడుచేయొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై లక్ష రూపాయలు వరకు జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో సిపి దొర, డిసిపి పద్మజ పాల్గొన్నారు.

వారంలో ఆరు రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని..

గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి -కొత్తకోట:వారంలో ఆరు రోజులకు తగ్గ కుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ రావికమతం మండలం చీమలపాడు శివారు అజయపురం గ్రామానికి చెందిన పివిటిజి తెగకు చెందిన ఆదివాసి గిరిజనులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజన సంఘం మండల నాయకులు పాంగి చంద్రయ్య, 5వ షెడ్యూల్ సాధన కమిటీ గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు తదిత రులు మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 30 జాబ్ కార్డులు కలిగి ఉన్నారని, ప్రతి రోజు 45 మంది తగ్గకుండా ఉపాధి హామీలో భాగంగా రోడ్డు పని చేస్తున్నారన్నారు. వారంలో కేవలం నాలుగు రోజులకే మస్తర్ ఇస్తున్నారని, మిగిలిన రెండు రోజులకి మస్తర్ సీట్లు ఇవ్వలేదని విమర్శించారు. జాతీయ ఉపాధి హామీ పథకం చట్ట ప్రకారం ఆరు రోజులు పని చేస్తే. ఆరు రోజులు వేతనం ఇవ్వాలని చట్టం చెబుతున్నా అధికారులు వీటిని అమలు చేయేదన్నారు. గ్రామంలో 27 కుటుంబాలు 120 ఎకరాలు జీడి మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఏడాది ఈ తోటలకు అగ్గి తెగు ళ్ల సోకడం తో జీడి పంటకు తీవ్ర నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఓఎఫ్ ఆర్ పట్టా భూములకు 150 రోజులు ఉపాధి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య లపై వచ్చే నెల 10వ తేదీ లోపు స్పందించకుంటే రావికమతం మండల అభివృద్ధి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు..

నినాదాలు చేస్తున్న గిరిజనులు, నాయకులు

కౌంటింగ్ సజావుగా జరిగేందుకు..

అన్నీ పార్టీల నాయకులు సహకరించాలి

-ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కుండా అన్ని పార్టీల నాయకులు సహకరిం చాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ కెవి మురళి కృష్ణ కోరారు. అనకాపల్లి జిల్లా శాంతికి మరో పేరుగా ఖ్యాతిని ఆర్జించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. శుక్రవారం రావికమతం తిరుమల కళ్యాణ మండపంలో నిర్వహించిన నియోజవర్గ స్థాయి వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి ఘర్షణలు, వివాదాలు, అవాంఛనీయ సంఘటనలు లేని జిల్లాగా ఇప్పటికే పేరు ఉందన్నారు. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు ప్రజలు, రాజకీయ నాయకులు సమన్వయం పాటించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు సమయంలో కేసు నమోదైతే అలాంటి వారి భవిష్యత్తు నాశనం అవుతుందని తెలిపారు. **డి.ఎస్.పి అప్పలరాజు మాట్లాడుతూ** జూన్ ఆరో తేదీ వరకు జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధించామన్నారు. బాణాసంచా పూర్తిగా నిషేధించామని తెలిపారు. వీటికి విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ ఏజెంట్లు పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి మొబైల్ ఫోన్, కాగితం, పెన్ను, డిజిటల్ చేతి గడి యారం, కాలిక్యులేటర్ వంటి వస్తువులకు అనుమతి లేదన్నారు. కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొత్తకోట, రోలుగుంట, బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం ఎస్సైలు పాల్గొన్నారు..

మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

అధిక దిగుబడినిచ్చే ..

పంటలపై అవగాహన కల్పించాలి

- జిల్లా వ్యవసాయ సంచాలకులు మోహన్‌రావు

ప్రజాశక్తి-నక్కపల్లి:తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి నిచ్చే పంటల సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సంచాలకులు బి మోహన్‌రావు సూచించారు. నక్కపల్లిలో టి సుబ్బిరామిరెడ్డి కళ్యాణమండపంలో శుక్రవారం పాయకరావుపేట సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పంటల ఉత్పత్తి, సాంకేతికపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మోహన్ రావు ఖరీఫ్ సన్నద్ధం పై విఏఏ, విహెచ్ఎలకు దిశా నిర్దేశం చేశారు. ఖరీఫ్‌లో వివిధ పంటల రకాల ఎంపిక, పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొత్త రకాలైన వరి వంగడాలను రైతులకు పరిచయం చేయాలన్నారు. తక్కువ పెట్టుబడితో, అధిక దిగుబడిని నిచ్చే, తెగుళ్లను తట్టుకునే పంటలను సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువును రైతులు వినియోగించుకునేలా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు .బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం సస్య సేద్య శాస్త్రవేత్త ప్రసాద్‌రావు మాట్లాడారు. ఖరీఫ్ పంటలలో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన రకాల ఎంపిక, నారు మడి యాజమాన్యం, వరిలో తక్కువ ఖర్చుతో సాగు విధానాలు, కలుపు యాజమాన్యంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఉమాప్రసాద్, ఆదినారాయణ, సరోజినీ, చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మోహన్‌రావు